సాక్షి పెద్దపల్లి

బుధవారం । 7 । మే । 2025



వేగంగా ధాన్యం సేకరణ

సుల్తానాబాద్‌రూరల్: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీఆర్డీవో కాళిందిని ఆదేశించారు. గర్రెపల్లి కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు.



షార్ట్‌ఫిలిం ఆవిష్కరణ

రామగిరి: సెంటినరీకాలనీలోని మంథని జేఎన్టీయూ పనుల పురోగతిపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులు రూపొందించిన షార్ట్ ఫిలింను ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ఆవిష్కరించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.0/27.0

రోజంతా ఎండగా, ఉక్కపోతగా, అసౌకర్యంగా ఉంటుంది. పగటిపూట వడగాడ్పులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న స్వప్నరాణి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని జిల్లా జడ్జి స్వప్నరాణి అన్నారు. చిన్నకల్వలలో మంగళవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, ఉచిత న్యాయ సేవలు అందిస్తామని అన్నారు. పంచాయతీ కార్యదర్శి రణధీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్ అభివృద్ధికి చర్యలు



మొక్క నాటుతున్న చందన్‌కుమార్ సామంత

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ తెలంగాణ యాష్‌పాండ్ సమీపంలో గ్రీన్‌బెల్ట్ అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత తెలిపారు. ప్లాంటులోని 33 ఎకరాల్లో 33 వేల రకాల మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ఈడీ ప్రారంభించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ఎన్టీపీసీ కృషి చేస్తోందన్నారు. జీవవైవిధ్యాన్ని పెంపొందించడమే లక్ష్యమన్నారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. జనరల్ మేనేజర్లు త్రిపాఠి, ముకుల్ రాయ్, సింఘా రాయ్, ఏజీఎం బిజయ్‌కుమార్ సిక్దర్, అధికారులు, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.


రెండు గ్రామాల్లో సదస్సులు



దరఖాస్తు చేస్తున్న రైతులు

ఎలిగేడు: భూభారతి చట్టం ద్వారా భూసంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేసిన ఎలిగేడు మండలంలోని ఎలిగేడు, బుర్హాన్‌మియాపేటలో రెండోరోజు మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఎలిగేడులో 115, బుర్హాన్‌మియాపేటలో 60 దరఖాస్తులు అందాయని అదనపు కలెక్టర్ వేణు తెలిపారు. తహసీల్దార్ బషీరొద్దీన్, కలెక్టరేట్ సూరింటెండెంట్ యక్కన్న, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్‌ఐలు చంద్రశేఖర్, జయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే అప్పులు



ర్యాలీలో హర్కర, ఠాకూర్, విజయరమణారావు

పాలకుర్తి(పెద్దపల్లి): పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు అన్నారు. కుక్కలగూడూరులో మంగళవారం నిర్వహించిన జైబాపు..జైభీమ్.. జైసంవిధాన్‌లో ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రామగుండం, పెద్దపల్లి ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్, నాయకులు జంగ రాఘవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై సీఎం శ్రద్ధ

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రం అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపారని హర్కర వేణుగోపాలరావు అన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో స్థానిక నాయకులు రమేశ్‌గౌడ్, అనిల్, శ్రీనివాస్ తదితరులు ఆయనను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం పెద్దపల్లి పర్యటనకు వచ్చిన సందర్భంగా హామీ ఇచ్చిన ఆర్టీసీ బస్‌డిపో, బైపాస్‌రోడ్డు, జిల్లా కోర్టు, ప్రభుత్వ ఆస్పత్రి భవన ఆధునికీకరణ తదితర పనులు జిల్లా మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో సాగుతున్నాయని హర్కర తెలిపారు.

సమ్మెకు ఆశ వర్కర్లు సై

పెద్దపల్లిరూరల్: దేశవ్యాప్తంగా ఈనెల 20వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెలో ఆశ వర్కర్లు పాల్గొంటారని ఆశ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి తెలిపారు. మంగళవారం మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని ఆమె కోరారు. నాయకులు శోభారాణి, రేణుక, అనురాధ, కవిత, నిర్మల, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ బాహుబలి

- వాహనాల ఫిట్‌నెస్ ఇక పక్కా..
- అందుబాటులోకి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్
- ఏఎఫ్‌ఎంఎస్ సాఫ్ట్‌వేర్‌తో సామర్థ్య పరీక్షలు
- త్వరలో రూ.8 కోట్ల యంత్రసముదాయం ఇన్‌స్టాలేషన్
- కేంద్రం ఆదేశాలతో తిమ్మాపూర్ ఆర్టీఏ కార్యాలయంలో నిర్మాణం
- ఫిట్‌నెస్ వివరాలు నేరుగా 'వాహన్' పోర్టల్‌తో అనుసంధానం




ఏటీఎస్ కేంద్రం నమూనా

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఒకప్పుడు వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ విషయంలో ఏదోలా నెట్టుకొచ్చేవారు. ఇందులో అక్రమాలకు పుష్కలంగా ఆస్కారం ఉండేది. ఫలితంగా ఫిట్‌నెస్‌లేని వాహనాలు రోడ్ల మీద అమాయకులను బలిగొన్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇకపై అలాంటి రోడ్డు ప్రమాదాలేవీ జరగకుండా రోడ్డు భద్రతలో భాగంగా.. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) అనే భారీ యంత్ర సముదాయాన్ని ఇన్‌స్టాల్ చేయనున్నారు. తిమ్మాపూర్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో త్వరలో ఇన్‌స్టాల్ చేయనున్న ఈ యంత్ర సముదాయం.. ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ (ఏఎఫ్‌ఎంఎస్) ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పనిచేయనుండటం గమనార్హం. ఈ యంత్రాల ఇన్‌స్టాలేషన్ బాధ్యతలను ఆర్‌అండ్‌బీ అధికారులు తీసుకున్నారు. పూర్తి అత్యాధునిక సాంకేతికతతో నడిచే ఈ భారీ యంత్రాల సముదాయం ఇకపై ఉమ్మడి జిల్లాలోని అన్ని లైట్ మోటార్ వెహికిల్స్ నుంచి భారీ యంత్రాల వరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేయనుంది.

ఏటీఎస్ ప్రత్యేకతలు ఏంటంటే..

ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) ఒక యంత్రం కాదు. ఇది వాహనాల ముఖ్యమైన విడిభాగాల సామర్థ్యాన్ని కచ్చితంగా మదించి రిపోర్ట్ ఇచ్చే బహుళ యంత్ర సముదాయం. ఎందుకంటే వాహనంలో ఏ భాగం సరిగా పనిచేయకున్నా.. అది ప్రమాదాలకు దారితీస్తుంది. పైగా ప్రస్తుతం మాన్యువల్‌గా జారీ చేసే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లలో అనేక లోపాలు ఉన్నాయి. అందుకే దేశవ్యాప్తంగా అలాంటి లోపాలు నివారించేందుకు ఏకరూపకంగా, దోషరహితంగా, పూర్తి కంప్యూటీకరణ చేసిన ఏటీఎస్ యంత్రాలతో కచ్చితమైన ఫిట్‌నెస్ రిపోర్టు ఇవ్వడం దీని ప్రత్యేకత. హెడ్‌లైట్, స్టీరింగ్, టైర్ కోసం స్లిప్‌టెస్ట్, సస్పెన్షన్, ఇంజిన్, నాయిస్, ఎయిర్‌పొల్యూషన్.. ఇలా ప్రతీ విడిభాగం పనితీరును పకడ్బందీగా తనిఖీ చేసి ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ (ఏఎఫ్‌ఎంఎస్) రిపోర్ట్ ఇస్తుంది. ఆ వెంటనే.. ఆ రిపోర్ట్‌ను కేంద్రం ఆధ్వర్యంలో ఉన్న 'వాహన్‌–పరివాహన్' పోర్టల్‌కు చేరవేస్తుంది. ఇలా ప్రతీ బండి సామర్థ్యం, దాని వివరాలు అన్నీ దేశంలో ఎక్కడ నుంచైనా అధికారులు చూసే వీలుంటుంది. ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలోని గ్రానైట్, ఇసుక, మైనింగ్, బొగ్గు, రైస్‌మిల్లుల కోసం నడిచే భారీ వాహనాలు ఇకపై ఈ యంత్రాలతో ఫిట్‌నెస్ తీసుకోవాల్సిందే. పాత వాహనాలకు ఫిట్‌నెస్ లేకపోతే ఒకటి రెండు సార్లు అవకాశం ఇస్తారు. అయినా మార్పు రాకపోతే ఎండ్ ఆఫ్ లైఫ్ సర్టిఫికెట్ జారీ చేసి ఆ వాహనాలను స్క్రాప్‌కు పంపిస్తారు.



ఏటీఎస్ ఇన్‌స్టాలేషన్ బ్లూప్రింట్



తిమ్మాపూర్‌లోని రోడ్డు భద్రతా పార్క్ కార్యాలయం

15ఏళ్లు నిండిన వాహనాల వివరాలు

జిల్లా	వాహనాలు
కరీంనగర్	1,58,129
జగిత్యాల	4,283
పెద్దపల్లి	9,660
రాజన్నసిరిసిల్ల	2,039
మొత్తం	1,74,111

నోట్: ఆటోరిక్షా, కాంట్రాక్ట్ క్యారేజ్, విద్యాసంస్థల బస్సులు, గూడ్స్‌క్యారేజ్, మ్యాక్సీ క్యాబ్, మోటర్ క్యాబ్, కారు, ద్విచక్రవాహనం, ప్రైవేట్ సర్వీస్ వెహికిల్, స్టేజీ క్యారేజ్, ట్రాక్టర్, ట్రైలర్‌తో కలిపి.

రెండెకరాల స్థలంలో..

రోడ్డు భద్రత చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు ఒక ఏటీఎస్ యంత్ర సముదాయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కరీంనగర్‌లోని తిమ్మాపూర్ ఆర్టీఏ కార్యాలయంలో ఈ యంత్ర సముదాయాన్ని ఇన్‌స్టాల్ చేయనున్నారు. ఇది ఉమ్మడి జిల్లా వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందించనుంది. భారీ వాహనాలకు 1500 చదరపు మీటర్ల స్థలం కావాల్సి వస్తుంది. ఇలా ఉమ్మడి జిల్లాలోని హెవీ, లైట్ మోటార్ వెహికిల్స్‌ను బట్టి.. ఇక్కడ నాలుగు లేన్లు అవసరమవుతాయని ఇందుకోసం ఎకరంన్నర నుంచి రెండెకరాల స్థలం అవసరం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఇందుకోసం భారీ షెడ్లు, వచ్చే వాహనాల పార్కింగ్, డ్రైవర్ల కోసం వెయిటింగ్ రూం, సీటింగ్ ఏర్పాటు, టాయిలెట్లు, జనరేటర్లు తదితరాలు ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. ఈ యంత్రాల ఇన్‌స్టాలేషన్, షెడ్ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన అంతా కేంద్రం మార్గదర్శకాల మేరకు రోడ్లు భవనాల శాఖ ఏర్పాటు చేయనుంది.

పైసలిస్తేనే 'అన్‌ఫిట్'

- సింగరేణిలో మెడికల్ ఇన్వాలిడేషన్ దందా
- దృష్టి సారించిన విజిలెన్స్, ఏసీబీ అధికారులు
- కొత్తగూడెంలో ఏసీబీ వలకు చిక్కిన పెద్దచేప
- లోతుగా కూపీలాగుతున్న అధికారులు
- అప్రమత్తమైన సింగరేణి యాజమాన్యం



గోదావరిఖని: సింగరేణిలో కార్మికుల మెడికల్ అన్‌ఫిట్ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. దళారులు రంగ ప్రవేశం చేసి ఒక్కో కార్మికుడి నుంచి రూ.6 లక్షల నుంచి రూ. 8లక్షల వరకు మామూళ్లు వసూలు చేస్తూ రూ.కోట్లు కూడబెడుతున్నారు. దళారీ వ్యవస్థను రూపుమాపేందుకు, మెడికల్ బోర్డులో దందాను అరికట్టేందుకు సింగరేణి సీఎండీ బలరాం కొత్తగూడెంలో ఏసీబీ డీఎస్పీస్థాయి అధికారిని నియమించారు. అవినీతిని అరికట్టేందుకు నిఘా పెట్టాలని ఏసీబీ ఐజీకి సీఎండీ విజ్ఞప్తి చేశారు. మొదట్లో దళారీ వ్యవవస్థ వెనుకడుగు వేసినా.. ప్రస్తుతం మెడికల్ ఇన్వాలిడేషన్ కమిటీతో తమకు మంచి సంబంధాలు ఉన్నాయని, వారసులను ఉద్యోగంలోకి తీసుకునేలా కార్మికులను మెడికల్ అన్‌ఫిట్ చేయిస్తామని నమ్మబలుకుతున్నారు. ఇలా కార్మికుల నుంచి వసూలు చేసిన సొమ్ములో పైరవీదారుకు రూ.లక్ష, మిగతా సొమ్ము అధికారులకు తలా కొంత పంచుతున్నారని అంటున్నారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కాకుంటే ఖర్చుల కోసం రూ.లక్ష ఉంచుకుని, మిగతా సొమ్ము వాపస్ ఇస్తున్నారు. కొందరైతే వాపస్ ఇవ్వకపోవడంతో చాలాచోట్ల పంచాయితీలు ఠాణా వరకూ వెళ్తున్నాయి.

పట్టుబడిన అవినీతి తిమింగళం

మెడికల్ ఇన్వాలిడేషన్ పేరిట దందాకు పాల్పడుతున్న ఓ నాయకుడిని కొత్తగూడెం ఏసీబీ డీఎస్పీ మంగళవారం అదుపులోకి తీసుకోవడం, బ్యాంకు ఖాతాల్లో రూ.కోటి వరకు లావాదేవీలు సాగినట్లు గుర్తించడంతో దందా మళ్లీ ఊపందుకున్న దానికి బలం చేకూర్చినట్లయ్యింది. దందాలో అన్ని ఏరియాల్లో బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. మెడికల్ దందాలోని సదరు నేతకు అన్ని ఏరియాలతో లింక్‌లు ఉన్నట్లుగా సమాచారం. యాజమాన్యం ఈవిషయంలో లోతుగా ఆరా తీస్తోంది. గతంలో కొత్తగూడెం ప్రాంతంలో పనిచేసిన ఓ అధికారి విషయంలో కూడా సీరియస్ చర్యలు చేపట్టినట్లుగా తెలుస్తోంది.

దందా ఎందుకు సాగుతోంది?

సింగరేణి కార్మికుల వారుసులకు మెడికల్ ఇన్వాలిడేషన్‌తో కారుణ్య నియామాల ద్వారా ఉద్యోగం ఇస్తున్నారు. ఇందుకోసం కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రతీనెల సుమారు 200 మంది వరకు మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేస్తున్నారు. కనీసం రెండేళ్ల సర్వీసు ఉండి, కచ్చితమైన అనారోగ్య సమస్యలతో బాధపడేవారు అర్హులు. వీటిని ఆసరాగా చేసుకుంటున్న పైరవీకారులు.. తాము చెప్పిన వారికే మెడికల్ బోర్డులో ఇన్వాలిడేషన్ అవుతుందని, లేకుంటే అదే ఉద్యోగం చేయాల్సి వస్తుందని, ఈలోగా రెండేళ్ల గడువు తీరిపోతుందని కార్మికులను బెదిరిస్తూ దరఖాస్తుదారులతో బేరసారాలకు దిగుతున్నారు. వీరిలో 80 శాతం మంది కార్మికులు మెడికల్ ఇన్వాలిడేషన్ సక్సెస్‌కావడంతో సహజంగానే లంచం ఇచ్చుకుంటున్నారు. అయితే, సింగరేణి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా అవినీతి ఆగడంలేదు.

యాజమాన్యం తీరుతోనే..

కొందరు కార్మికులకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగినా, మరికొందరిని స్ట్రెచర్‌పై తీసుకెళ్లినా మెడికల్ అన్‌ఫిట్ చేసేందుకు డాక్టర్లు నిరాకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మామూళ్లు ముట్టజెప్పి, దర్జాగా నడుచుకుంటూ వెళ్లేవారిని అన్‌ఫిట్ చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇలా బోర్డు అనుసరిస్తున్న తీరుపై కార్మికుల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఈక్రమంలోనే తాము మెడికల్ ఇన్వాలిడేషన్ అయి తమ వారసులకు ఉద్యోగం ఇప్పించాలనే ఆశతో కార్మికులు తప్పుదారి ఎంచుకుంటున్నారు.

రెండేళ్ల నిబంధన తొలగిస్తే..

మెడికల్ ఇన్వాలిడేషన్‌కు సర్వీసు కనీసం రెండేళ్లు ఉండాలనేది కంపెనీ నిబంధన. దీనిని తొలగిస్తే దందా నిలిచపోతుందని నిపుణులు చెబుతున్నారు. కొత్తగూడెంలోని ప్రధాన ఆస్పత్రిలోనే కాకుండా రామగుండం, బెల్లంపల్లి రీజియన్లలోనూ మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలంటున్నారు. తద్వారా కార్మికుల్లో భయం తొలగిపోతుందంటున్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో దందా

రామగుండంప్రాంతంలో మెడికల్ దందా జోరుగా సాగుతోంది. దళారులు ఏజెంట్లను నియమించుకుని మెడికల్ ఇన్వాలిడేషన్ చేయిస్తామంటూ వసూళ్లకు పాల్పడుతున్నారు. గతంలోనూ ఇలాంటి వారు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి పెద్దమొత్తంలో వసూలు చేశారు. బాధితులు పోలీసులను ఆశ్రయించిన ఘటనలు అనేకం ఉన్నాయి.

ఎవరినీ నమ్మొద్దు



సింగరేణిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మవద్దు. ఇలాంటి వారి సమాచారాన్ని విజిలెన్స్‌కు చేరవేయాలి. మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియ పారదర్శకంగా సాగుతోంది. దళారులు ఎంతటివారైనా వదిలేది లేదు. ఏసీబీ, సింగరేణి విజిలెన్స్‌తో నిఘా కొనసాగుతోంది.

– బలరాం, సీఎండీ, సింగరేణి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఆరోగ్య ఉపకేంద్రాలు, పాఠశాలలు, ప్రహరీలు, వసతి గృహ భవన మరమ్మతులపై ఆరా తీశారు. ఈఈ గిరీశ్‌బాబు, ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా కూల్చివేతలు పూర్తిచేయాలి

కొత్త భవన నిర్మాణం కోసంన ఆస్పత్రి పాతభవనాన్ని కూల్చివేతలు వారంరోజుల్లోగా పూర్తిచేయాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో చేపట్టిన కూల్చివేత పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. సూపరింటెండెంట్ శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం

మంథని/రామగిరి: వరంగల్‌–మంచిర్యాల మధ్య చేపట్టిన జాతీయ రహదారి సీఎస్‌జీ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. మంథని మండలం వేంపాడు, పుట్టపాక, రామగిరి మండలం ఆదివారంపేట వద్ద చేపట్టిన జాతీయ రహదారి పనులను కలెక్టర్ పరిశీలించారు. మంథని మార్కెట్ యార్డు, ఎగ్లాస్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పాత పాలకేంద్రంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లా సహకార అధికారి శ్రీమాల, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్లు కుమారస్వామి, సుమన్, గిర్దావర్‌లు మహేశ్, రవిశంకర్ తదితరులు ఉన్నారు.



కూల్చివేతలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు

పెద్దపల్లిరూరల్: అర్హులైన దివ్యాంగులందరికీ యూనిక్ డిసెబిలిటీ ఐడీ కార్డులు జారీచేస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కాళిందిని తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం యూడీఐడీ కార్డుల జారీపై డీఎంహెచ్‌వో అన్నప్రసన్న కుమారి, జెడ్పీ సీఈవో నరేందర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. 31అక్టోబర్ 2023 నాటికి జారీచేసిన సదరం సర్టిఫికెట్లకు యూడీఐడీ కార్డులు జనరేట్ చేసి పంపిణీ చేశామన్నారు. కార్డు రానివారు ఆధార్ నంబరు లేదా మొబైల్ నంబరు ద్వారా సమాచారం తెలుసుకోవచ్చని అన్నారు. వైకల్యం శాతాన్నిబట్టి కార్డులు పంపిణీ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకోసం మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. కార్డుల జారీ, వినియోగంపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. సంబంధిత అధికారులు, మీసేవ నిర్వాహకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

ఎలిగేడు(పెద్దపల్లి): గ్రామీణ ప్రాంతాలకు బీటీ రోడ్లు నిర్మిస్తున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శివపల్లి – నర్సయ్యపల్లి(ఎస్సీకాలనీ) వరకు చేపట్టిన బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రోడ్ల నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడి గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కోతల్లేకుండా వడ్లు సేకరిస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టర్ హనుమంతరావు, నాయకులు దుగ్యాల సంతోష్‌రావు, సామ రాజేశ్వర్‌రెడ్డి, నరహరి సుధకర్‌రెడ్డి, కొండ తిరుపతిగౌడ్, బాలుసాని పరుశరాములుగౌడ్, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, బూర్ల వెంకటసత్యం, చంద్రగిరి పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

కమల వికాసానికి 'ఆధిపత్యమే' అవరోధం

- నియామకానికి నోచని మండల, జిల్లా కమిటీలు
- గ్రూపు రాజకీయాలతో బీజేపీ కార్యకర్తల్లో నైరాశ్యం
- పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌పై కేంద్రమంత్రి సంజయ్ ప్రభావం..!
- 'బండి'కి దుగ్యాలతో విభేదాలే 'గుజ్జుల' దోస్తీకి కారణమా?



పాక్ జాతీయులను పంపించాలని కలెక్టర్‌కు విన్నవిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రామకృష్ణారెడ్డి, 'కాశిపేట'



మంగళవారం మున్సిపల్ ఆఫీసులో వినతిపత్రం అందిస్తున్న దుగ్యాల ప్రదీప్‌కుమార్ వర్గీయులు

పెద్దపల్లిరూరల్: బీజేపీలో ఆధిపత్యపోరు ఆగడం లేదు. ఇప్పటివరకు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ మధ్య ఉన్న విభేదాలు కొత్తమలుపు తిరిగాయి. కేంద్రమంత్రి బండి సంజయ్, ప్రదీప్‌కుమార్ మధ్య ఏర్పడిన విభేదాలు ఇప్పుడు పెద్దపల్లి నియోజవర్గంపై స్పష్టమైన ప్రభావం చూపుతున్నాయని కమలం నేతలు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

'గుజ్జుల' ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక..

టీడీపీతో పొత్తులో భాగంగా 1999 ఎన్నికల్లో బీజేపీకి చెందిన గుజ్జుల రామకృష్ణారెడ్డి అనూహ్యంగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత మళ్లీ బీజేపీ ఏనాడూ ఆధిక్యం ప్రదర్శించలేకపోయింది. మరోవైపు.. పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, బండి సంజయ్‌కు మధ్య ఉన్న విభేదాలు.. అప్పటికే బీజేపీలో కొనసాగుతున్న బండి సంజయ్ కుమార్, గుజ్జుల రామకృష్ణారెడ్డికి మధ్య ఉన్న వైరం.. ఇప్పుడు దోస్తీకి దారితీయడం గమనార్హం.

బీజేపీలో 'అధ్యక్ష' పాలన

దాదాపు ఆరేళ్లుగా బీజేపీలో అధ్యక్షులు మినహా పూర్తిస్థాయి కార్యవర్గం నియమించిన దాఖలాలులేవు. ఆర్టీసీ మాజీ చైర్మన్ సోమారపు సత్యనారాయణకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించినా.. గ్రూపు రాజకీయాలు, ఇతర కారణాలతో ఆయన స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. అప్పట్నుంచి రెండున్నరేళ్లలో ముగ్గురు అధ్యక్షులు మారినా.. కార్యవర్గ నియామకం లేకుండాపోయింది. ఆ తర్వాత రామగుండం నియోజకవర్గానికి చెందిన రావుల రాజేందర్, మంథనికి చెందిన సునీల్‌రెడ్డి అధ్యక్ష బాధ్యతలు చేపట్టినా కమిటీ వేయలేకపోయారు. ఇటీవల పెద్దపల్లి నియోజకవర్గానికి చెందిన కర్రె సంజీవరెడ్డి కేంద్రమంత్రి బండి సంజయ్ ఆశీస్సులతో అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆ తర్వాత జిల్లాకమిటీని కూడా ఖరారు చేశారు.. కానీ, గంటల వ్యవధిలోనే దానిని రద్దు చేశారు.

పోటాపోటీ కార్యక్రమాలు..

పెద్దపల్లిలో గుజ్జుల రామకృష్ణారెడ్డి తర్వాత జరిగిన ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీచేసిన వారెవరూ ఎమ్మెల్యేగా విజయం సాధించలేకపోయారు. స్థానిక సంస్థల్లో కొన్నిచోట్ల గెలిచినా ప్రభావం అంతంతమాత్రమే చూపించింది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పెద్దపల్లి శివారు బందంపల్లికి చెందిన మల్క కొమురయ్య బీజేపీ నుంచి అనూహ్యంగా విజయం సాధించి పార్టీలో నూతనోత్తేజం నింపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కూడా కమలం జాబితాలో చేరింది.

గ్రూపు రాజకీయాలు ఆగేదెలా..

ప్రదీప్‌కుమార్ గత అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి పోటీచేశారు. గుజ్జుల రామకృష్ణారెడ్డి వర్గీయులు తనకు సహకరించలేదని ఆరోపణలు చేశారు. ఒకసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన గుజ్జులకు గత ఎన్నికల్లో భంగపాటు తప్పలేదు. అయితే, వచ్చేఎన్నికల నాటికి ప్రదీప్‌ను నియోజకవర్గం వైపు రాకుండా ఎలా చేయాలనే ఆలోచనతో పావులు కదుపుతున్నట్లు పార్టీ వర్గాలే చర్చించుకుంటున్నాయి.

ఏకాభిప్రాయం కుదిరేనా..?

జిల్లాలోని మండల కమిటీలను ఈనెల 15లోగా ఖరారు చేయాలని అధిష్టానం ఆదేశించింది. ఇందుకోసం మండలానికో ప్రభారిని నియమించి పేర్లను ఖరారు చేసేలా చర్యలు చేపట్టింది. దీంతో పెద్దపల్లి సెగ్మెంట్‌లో గుజ్జుల వర్గానికి చెందిన పార్టీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్ వర్గీయులు వేర్వేరు జాబితాలు అందించినట్లు సమాచారం. అదేవిధంగా పాక్ జాతీయులను ఇక్కడి నుంచి పంపించి వేయాలనే డిమాండ్‌తో ఆ పార్టీలోని రెండు వర్గాలు వేర్వేరుగా అధికారులకు మంగళవారం వినతిపత్రాలు సమర్పించడం చర్చనీయాంశంగా మారింది. ప్రధాని నరేంద్రమోదీ పాలనపై ప్రజల్లో ఉన్న నమ్మకం, బీజేపీకి మంచి ఆదరణ ఉన్నా స్థానికంగా ఉన్న గ్రూపు రాజకీయాలతో తామేమీ చేయాలోననే మీమాంస క్రియాశీల కార్యకర్తలు, ముఖ్యనేతల్లో నెలకొంది. పార్టీ అధిష్టానం స్పందించి ఆధిపత్యపోరుకు చెక్‌పెట్టి పార్టీ పటిష్టానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పెద్దపల్లిపై 'బండి' మార్క్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్, ప్రధాన కార్యదర్శిగా దుగ్యాల ప్రదీప్‌కుమార్ పనిచేసిన సమయంలో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు పార్టీవర్గాలు బాహాటంగానే చర్చించుకుంటున్నాయి. ఎమ్మెల్యేగా కొనసాగిన సమయంలో రామకృష్ణారెడ్డి.. బండి సంజయ్‌ను వివిధ రకాలుగా ఇబ్బంది పెట్టినా.. ప్రస్తుత సమీకరణలను బట్టి దుగ్యాల ప్రదీప్‌ను ఒంటరిని చేస్తే రాష్ట్ర కమిటీలో సంజయ్‌కు, పెద్దపల్లి సెగ్మెంట్‌లో గుజ్జులకు ఎదురు ఉండదనే ఆలోచనతో కేంద్రమంత్రి హోదాలో బండి సంజయ్‌తో గుజ్జుల దోస్తీ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలోనే గుజ్జులకు సన్నిహితుడైన కర్రె సంజీవరెడ్డికి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది.

క్లుప్తంగా

పిడుగుపాటుకు పశువు మృతి



పశువు కళేబరం వద్ద రైతు

చిగురుమామిడి(హుస్నాబాద్): మండలంలోని సుందరగిరి గ్రామంలో సోమవారం రాత్రి రైతు జీల రాజు తెలిపిన వివరాలు.. రాజు తన వ్యవసాయబావి వద్ద పశువుల పాకలో సోమవారం రాత్రి పాడి పశువును కట్టేశాడు. పిడుగుపాటుకు రూ.50వేల విలువగల పశువు మృతి చెందింది. మండల పశువైద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నష్టంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని పేర్కొన్నారు.

ఐదుగురిపై వరకట్నం కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): అదనపు కట్నం తేవాలని వేధింపులకు పాల్పడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు. మండలంలోని పాపక్కపల్లి గ్రామానికి చెందిన రవళికి ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామానికి చెందిన ఉమ్మనవేణి మహేశ్‌కు 2024లో కట్నకానుకలతో వివాహం జరిగింది. కొంతకాలంగా అదనపు కట్నంగా రూ.పది లక్షలు తీసుకరావాలని రవళిని భర్త, అత్తామామ ప్రమిల, మల్లయ్య, ఆడపడుచు, ఆమె భర్త మౌనిక, మల్లేశ్ మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరిపై..

జమ్మికుంట(హుజూరాబాద్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు. ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన చిట్యాల కిషోర్ ఏప్రిల్ 29న జమ్మికుంట పట్టణంలో పేయింటింగ్ పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా, గాంధీచౌక్ సమీపంలో శంకరపట్నం మండలం చింతలపల్లికి చెందిన శనిగరపు చంటి అజాగ్రత్తగా బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ఘటనలో కిషోర్‌కు తీవ్రగాయాలై చికిత్స పొందుతున్నాడు. బాధితుడి భార్య కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ప్లాట్ కొనిస్తానని మోసం చేసిన వ్యక్తిపై..

జమ్మికుంట(హుజూరాబాద్): రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తూ ప్లాట్ కొనిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు. 2023లో పట్టణంలోని పొనగంటి కావ్య నుంచి మ్యాన కొండ సాయికిరణ్ తక్కువ ధరకు ప్లాట్ కొనిస్తానని రూ.93లక్షలు తీసుకున్నాడు. ప్లాట్ చూపించకుండా మోసం చేస్తున్నాడు. డబ్బు అడిగితే అంతుచూస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

వరి పొలం దగ్ధం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండలంలోని హుస్సేన్‌మియా వాగు సమీపంలో మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు జంగ రాజయ్యకు చెందిన ఎకరంపావు బాస్మతి వరి, కొరకండ్ల శ్రీనివాస్‌రెడ్డికి చెందిన 30 గుంటలు బాస్మతి వరి కుప్ప మంటల్లో కాలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. వరి కొయ్యలు కాలపెట్టడంవల్లే నిప్పురవ్వలు గాలికి చెలరేగి మంటలు వ్యాపించినట్లు బాధిత రైతులు వాపోయారు. సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అంజన్నా.. నీడ లేదన్నా..

- ఆలయ పరిసరాల్లో అక్కడక్కడే చలువ పందిళ్లు
- ఎండకు భక్తుల ఇబ్బంది
- వై జంక్షన్ నుంచి దారి పొడవునా చలువ పందిళ్లు వేయాలని భక్తుల వేడుకోలు



ఆలయ సమీపంలో చలువ పందిళ్లు



కొండగట్టులో స్వామివారి దర్శనం కోసం ఎండలో నడిచి వెళ్తున్న భక్తులు

మల్యాల(చొప్పదండి): ఎండల తీవ్రతకు కొండగట్టు అంజన్న సన్నిధిలో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. స్వామివారిని దర్శించుకుని సేద తీరేందుకు నీడ కరువైంది. ఆలయ పరిసరాల్లో మాత్రమే చలువ పందిళ్లు వేశారు. వై జంక్షన్ నుంచి ఆలయ సమీపం వరకు సుమారు మూడు వందల మీటర్ల దూరం నడిచి వెళ్లాలి. ఆ ప్రాంతంలో చలువ పందిళ్లు లేక ఎండకు మహిళలు, చిన్నారులు, వృద్ధులకు తిప్పలు తప్పడంలేదు.

కాలినడకన వచ్చే భక్తుల ఇబ్బంది

కొండగట్టులో ఆలయ సమీపం వరకు వాహనాలు వెళ్తుండడంతో కాలినడక వెళ్లే భక్తులు ఇబ్బందులు పడుతున్నారని పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వాహనాలను ఆలయ సమీపంలోకి అనుమతించకూడదని, వికలాంగులు, వృద్ధులకు సంబంధించి వాహనాలను మాత్రమే అనుమతించాలని ఆలయ ఈవో ఆదేశాలు జారీ చేశారు.

అక్కడక్కడ మాత్రమే పందిళ్లు

వేసవి సెలవులు ప్రారంభం నుంచి రోజురోజుకు ఆంజనేయస్వామిని దర్శించుకునే భక్తుల రద్దీ పెరుగుతోంది. కాగా, భక్తులు ఎండ వేడిమి తట్టుకోలేక ఆలయ సమీపంలో నీడ కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆలయ ప్రధాన, వెనక ద్వారంతో పాటు ఆలయ కార్యాలయం ఎదుట, తాత్కాలిక అన్నదానం సత్రం వద్ద కొంతమేర చలువ పందిళ్లు ఉన్నా భక్తులకు సరిపోవడం లేదు.

వై జంక్షన్ నుంచి..

అంజన్న దర్శనానికి వచ్చేవారి కోసం వై జంక్షన్ సమీపంలోని ఆలయ తోరణం నుంచి చలువ పందిళ్లు వేయాలని భక్తులు కోరుతున్నారు. కాలినకడన వెళ్తున్న భక్తులు ఎండ వేడిమి తట్టుకోలేక ఆలయ ద్వారం వరకు చెప్పులతో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

దారి పొడవునా వేయాలి



కొండగట్టుకు వచ్చే భక్తుల కోసం ఆలయ తోరణం వై జంక్షన్ నుంచి దారి పొడవునా పోలీస్ అవుట్ పోస్ట్ వరకు చలువ పందిళ్లు వేయాలి. కాలినడక వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హనుమాన్ జయంతి వరకు వేచి చూడకుండా త్వరగా చలువ పందిళ్లు వేయాలి.

– బట్టు పవన్‌కుమార్, మల్యాల

భక్తులకు ఇబ్బంది కలగనీయం

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే వాహనాలు ఆలయం వరకు వెళ్లకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలంలో పార్కింగ్ చేసేలా చర్యలు చేపట్టినం. భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు వేసినం.

– శ్రీకాంత్‌రావు, ఈవో, కొండగట్టు

అంజన్న సన్నిధిలో రద్దీ





మల్యాల(చొప్పదండి): అంజన్న సన్నిధిలో మంగళవారం రద్దీ నెలకొంది. ఉదయం నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. కోనేరులో స్నానమాచరించి స్వామివారలకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

రోడ్డుకిందకు దూసుకెళ్లిన లారీ



శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని వంకాయగూడెంలో మంగళవారం వేకువజామున బొగ్గులారీ రోడ్డు కిందకు దూసుకుపోయింది. బొగ్గులోడ్ లారీ వైజాగ్ నుంచి నాగపూర్ వెళ్తుండగా వంకాయగూడెంలోకి చేరుకోగా డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో లారీ రోడ్డు కిందకు దూసుకుపోయిందని స్థానికులు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో మీసేవ కేంద్రం దగ్ధం



కాలిపోయిన పరికరాలు

సిరిసిల్లటౌన్: షార్ట్ సర్క్యూట్‌తో యువకుడి ఉపాధి కేంద్రం కాలిపోయిన ఘటన మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాలు.. సిరిసిల్ల పట్టణంలోని యూనియన్ బ్యాంకు సమీపంలో రజనీకాంత్ చాలా రోజులుగా మీ సేవ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి షాప్‌ను కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం దుకాణం తెరిచే సరికి కంప్యూటర్, ఫర్నీచర్, ప్రింటర్ తదితర వస్తువులు కాలిపోయినట్లు పేర్కొన్నాడు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

‘నల్లరంగు నోటు’ ముఠా అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

వెల్గటూర్(ధర్మపురి): నల్లరంగు నోటు పేరిట అమాయకుల నుంచి డబ్బు కాజేసే ముఠాను పట్టుకున్నట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. మంగళవారం వెల్గటూర్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. చెగ్యాం గ్రామానికి చెందిన రామిల్ల విజయ్‌సాగర్‌ను నల్లరంగులో ఉన్న రూ.500 నోట్లను ఒరిజినల్‌గా మార్చే రసాయనం ఉందని కంది నరేశ్, పాలాజి శ్రీనివాస్, ఎంబడి మల్లేశ్, అల్లాపు రాజు, మగ్గిడి కిషన్ నమ్మించారు. 17 ఫిబ్రవరి 2025 రోజున మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందన్‌పల్లి గ్రామానికి తీసుకెళ్లారు. ఒక ప్లాస్టిక్ గ్లాస్‌లో ఏదో రసాయనం పోసి నిందితుల వద్ద ఉన్న నలుపురంగు రూ.500 నోట్లను రసాయనంలో ముంచి ఒరిజినల్ నోట్లలా మారిపోయినట్లు నమ్మించారు. ఈ క్రమంలో రూ.లక్షకు రూ.ఐదు లక్షల నలరంగు రూ.500 నోట్లు ఇస్తామని, రసాయనంలో ముంచి సులభంగా లక్షలు సంపాదించవచ్చని విజయ్‌సాగర్‌ను మభ్యపెట్టారు. మార్చి 4న రూ.7 లక్షలు ఒరిజినల్ నోట్లు తీసుకున్నారు. కోటి లింగాలకు వస్తే రూ.35 లక్షల నల్లరంగు నోట్లు ఇస్తామని బొమ్మ కరెన్సీ నోట్ల కట్టలు చూపించారు. అదే సమయంలో రాజశేఖర్, కార్తీక్ అనే ఇద్దరు నిందితులు పోలీసులమని బెదిరించారు. నిందితులందరూ కలిసి రూ.7 లక్షల ఒరిజినల్ నోట్లతో పారిపోయారు. తర్వాత వారికి విజయ్‌సాగర్ ఫోన్ చేయగా, మరోసారి డబ్బు అడిగితే చంపేస్తామని బెదిరించారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణలో భాగంగా మంగళవారం నిందితులు వెలటూర్ మీదుగా కరీంనగర్ వెళ్తుండగా, స్తంభంపల్లి వద్ద తనిఖీల్లో శ్రీనివాస్, రాజు, మల్లేశ్, రాజశేఖర్, నరేశ్ పట్టుబడ్డారు. మరో ముగ్గురు నిందితులు కిషన్, నవీన్, కార్తీక్ పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి కారు, ఐదు సెల్‌ఫోన్లు, రూ.4వేల నగదు, ఆరు నలుపురంగు రూ.500 నోట్లు, 570 బొమ్మ కరెన్సీ నోట్లు, బైక్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. గతంలోనూ నిందితులపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ రాంనర్సింహారెడ్డి, వెల్గటూర్, ధర్మపురి, బుగ్గారం ఎస్సైలు ఉమాసాగర్, ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట్– బల్లార్షా సెక్షన్ల మధ్యలోని కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలో లెవల్ క్రాసింగ్ గేట్ వద్ద ఇదే గ్రామానికి చెందిన కాంతాల లక్ష్మి(67) పట్టాలు దాటుతుండగా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని మృతిచెందింది. రామగుండం జీఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ పర్శరాములు కథనం ప్రకారం.. లక్ష్మి మంగళవారం తన పుట్టినిల్లు సుల్తానాబాద్ మండలం తొగర్రాయికి బయలుదేరింది. రైల్వేగేట్ పడి ఉండటంతో అవతలివైపునకు దాటుతుండగా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

దొంగతనం కేసులో జైలు, జరిమానా

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలో గతేడాది ఏప్రిల్, మే నెలల్లో జరిగిన దొంగతనం (రెండు) కేసుల్లో నిందితుడు ఖమ్మం జిల్లాకు చెందిన గుర్రం కోటేశ్వర్‌రావుకు 10నెలల జైలు, రూ.4వేల జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి మంజుల తీర్పునిచ్చారు. ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపిన వివరాలు.. దొంగతనాలకు సంబంధించి పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల్లో కోటేశ్వర్‌రావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, నేరం రుజువు కావడంతో జూనియర్ సివిల్ జడ్జి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని ఎస్సై వివరించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 10 గ్రాముల బంగారం మాయం

వేములవాడ: వేములవాడలోని మార్కండేయనగర్‌లో తాళం వేసిన ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. తాటికొండ సంతోష్ అనే ఫిజియోథెరపిస్ట్ కుటుంబ సభ్యులతో కలిసి ఐదు రోజుల క్రితం విహారయాత్రకు వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు క్లూస్ టీంతో వేలిముద్రలు సేకరించారు. ఇంట్లో ఉన్న దాచిన రూ.25వేలకుపైగా నగదు, 10 గ్రాముల బంగారం వస్తువులు చోరీ అయింది. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముటేషన్ మార్చాలని ఆందోళన



మున్సిపల్ కార్యాలయంలో ఆందోళన చేస్తున్న మహ్మద్‌ఖాన్ అల్లుళ్లు

జగిత్యాల: ముగ్గురు సంతానంలో ఒకరికే ఇంటిని ముటేషన్ చేయడంతో మిగతా ఇద్దరు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేపట్టారు. వివరాలు.. జగిత్యాల పట్టణానికి చెందిన అఫ్సర్ బేగం, మహ్మద్ ఖాన్ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. అఫ్సర్‌బేగం మరణించిన అనంతరం మహ్మద్‌ఖాన్ ముగ్గురు కూతుళ్లలో ఒక కూతురుకు తన ఇంటిని ముటేషన్ చేశాడు. మిగతా ఇద్దరికి చేయకపోవడంతో మంగళవారం కూతుళ్లతో పాటు అల్లుళ్లు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. ఒకరికే ముటేషన్ ఎలా చేస్తారని, తమకు కూడా చేయాలని కూతుళ్లు, అల్లుళ్లు ఆందోళన చేపట్టడంతో పాటు, అందులో అల్లుడు జఫరోద్దీన్ కార్యాలయ గోడకు తల బాదుకోవడంతో తీవ్రగాయమైంది. వెంటనే 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈవిషయమై మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ, మహ్మద్‌ఖాన్ వారి కూతుళ్లలో ఒక కూతురుకే ఇల్లు ముటేషన్ చేశారని, తమ సమస్య కాదని, అది వారి కుటుంబ సమస్య అని పేర్కొన్నారు.

ఈసారైనా సిరులు కురిపించేనా..?

- రాజన్న భక్తుల తలనీలాల సేకరణకు నేడు ఏడోసారి టెండర్
- ఈ–టెండర్‌తో సరి
- బహిరంగ వేలం, సీల్డ్ టెండర్లు రద్దు



కల్యాణకట్టలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు (ఫైల్)

వేములవాడ: ఎములాడ రాజన్నకు భక్తులు సమర్పించుకునే కురులతో ఏటా సిరులు కురిశాయి. ఈనేపథ్యంలో కరోనా కాలంలో కల్యాణకట్టను మూసివేశారు. తర్వాత 2023–25 రెండేళ్ల కోసం నిర్వహించిన తలనీలాల సేకరణ టెండర్ రూ.19.01 కోట్లకు పెరిగింది. దీంతో రాజన్నకు భక్తుల కురులు సిరులు కురిపించాయి. అయితే ఏడాదిపాటు సక్రమంగా చెల్లింపులు చేసిన సదరు కాంట్రాక్టర్ పది నెలలుగా సేకరణ నిలిపివేసి చేతులెత్తేశాడు. దీంతో అధికారులు రంగంలోకి దిగి నేరుగా తలనీలాలను సేకరించి భద్రపరిచారు. టెండర్ సమయం 11 ఏప్రిల్ 2025తో ముగిసింది. ఈలోగా సదరు కాంట్రాక్టర్ కొన్ని డబ్బులను స్వామివారికి చెల్లించి మిగతా డబ్బు జూన్ వరకు చెల్లిస్తానని అగ్రిమెంట్ చేశారు. ఇందుకు ప్రభుత్వం నుంచి ఓ స్పెషల్ ఆర్డర్ కూడా రావడం గమనార్హం.

నేడు ఏడోసారి.. ఈ– టెండర్‌కే మొగ్గు

రాజన్నకు భక్తులు కల్యాణకట్టలో సమర్పించుకునే తలనీలాలను పోగు చేసుకునే హక్కు కోసం గత టెండర్ ఏప్రిల్ 11తో ముగియగా, అంతకు ముందే నాలుగుసార్లు ప్రకటన చేసి టెండర్ నిర్వహించారు. కానీ ఎవరూ హాజరుకాలేదు. ఐదోసారి రూ.13.67 కోట్లు, ఆరోసారి రూ. 14.01 కోట్లు కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొన్నారు. ఆశించినంత డబ్బు రాకపోయేసరికి ఆలయ అధికారులు నిబంధనల మేరకు టెండర్‌ను రద్దు చేశారు. దీంతో బుధవారం ఏడోసారి తలనీలాల టెండర్ నిర్వహించనున్నారు. అయితే ఈసారి సీల్డ్ టెండర్, బహిరంగ వేలం పాటలను ఆలయ అధికారులు రద్దు చేసి కేవలం ఈ–టెండర్‌కు మాత్రమే అవకాశం కల్పించారు. ఈసారైనా భక్తుల కురులతో రాజన్నకు సిరులు కురుస్తాయా.. లేదా వేచి చూడాల్సిందే.

తలనొప్పిగా తలనీలాల సేకరణ

భక్తుల తలనీలాల సేకరణ ఆలయ అధికారులకు తలకు మించిన భారంగా మారింది. టెండర్ నిర్వహించి కాంట్రాక్టర్‌కు అప్పగిస్తే ఈ పనులు కాంట్రాక్టరే తమ వ్యక్తులను ఏర్పాటు చేసుకుని నిర్వహించేవారు. అయితే కాంట్రాక్టర్ల నుంచి సరైన స్పందన రాక కల్యాణకట్ట నుంచి తలనీలాలను సేకరించి పోగు చేయడం ఇబ్బందిగా మారిందని అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. సీసీ కెమెరాలు, ప్రత్యేక సిబ్బంది, సెక్యూరిటీతో తలనీలాలను సేకరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పుస్తకం గురువుతో సమానం



కుటుంబ సమేతంగా కొండగట్టులో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద పూజలు

రామడుగు/మల్యాల: ప్రతీ వ్యక్తికి పుస్తకం ఒక గురువులాంటిదని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. రామడుగు మండలం వెదిర జిల్లా పరిషత్తు పాఠశాలలో ఆకర్షణ సతీశ్ 22వ గ్రంథాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కేరళకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఆకర్షణ సతీశ్ ఇప్పటి వరకు 21గ్రంథాలయాలు ఏర్పాటు చేశారని, 22వది వెదిరలో ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన కోరుకండ్ల పల్లవి, ప్రణీతను సత్కరించారు. పద్మశాలివాడ నుంచి గణేశ్‌నగర్ వరకు రూ.50లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీరోడ్డు ప్రారంభించారు. కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ రాజేశ్వరీ, ఎంపీడీవో రాజేశ్వరీ, ఎంఈవో వేణుకుమార్, హెచ్‌ఎం రాజమౌళి పాల్గొన్నారు.

లివింగ్ రిలేషన్ మంచిది కాదు

యువత చెడుదారిన వెళ్లవద్దని, తల్లిదండ్రులు తలవంచుకునేలా ఆకర్షణే ప్రేమగా భావించి, లివింగ్ రిలేషన్‌కు వెళ్లవద్దని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో మహిళల ఫిర్యాదులు పెరిగాయని, కౌన్సెలింగ్ చేస్తూ తక్షణమే పరిష్కరించేలా కృషి చేస్తున్నామని అన్నారు. మహిళలతోపాటు పురుషులుసైతం మహిళా కమిషన్‌ను సంప్రదిస్తున్నారని అన్నారు. తమ పరిధిని మించిన వాటినిసైతం మానవీయ కోణంలో స్పందిస్తూ, కొన్ని సందర్భాల్లో సుమోటాగా స్వీకరించి, సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. లివింగ్ రిలేషన్‌షిప్‌లో ఉన్నవారు సైతం తమ సమస్యల పరిష్కారం కోసం కమిషన్‌ను సంప్రదిస్తున్నారని, యువతీ, యువకులు లివింగ్ రిలేషన్‌ను ఎంచుకోవద్దని సూచించారు. కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయాభివృద్ధి తనవంతు కృషి చేస్తామని తెలిపారు.

ఆస్తమా వ్యాధి కాదు.. అలర్జీ మాత్రమే



మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్రచారి

కరీంనగర్‌టౌన్: ఆస్తమా వ్యాధి కాదని, కేవలం అలర్జీ మాత్రమేనని మెడికవర్ పల్మనాలజిస్టు డాక్టర్ రవీంద్రచారి అన్నారు. వరల్డ్ ఆస్తమా డే సందర్భంగా మంగళవారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దగ్గు, ఆయాసం, అలర్జీ మాత్రమే ఆస్తమా లక్షణాలని, అంటువ్యాధి కాదని, దుమ్ము, చలగాలి ద్వారా మాత్రమే ఊపిరితిత్తులు రియాక్షన్ అవుతాయని పేర్కొన్నారు. ఆస్తమా వచ్చినవారు జీవితాంతం మందులు వాడాల్సిన పనిలేదని, త్వరగా గుర్తిస్తే నయం చేయడం సులువు అవుతుందని వివరించారు. ఆస్తమాకు మందులు వాడితే పిల్లలు పుట్టరనే అపోహలు ఉన్నాయని, వాటిని నమ్మవద్దన్నారు. ఆస్తమాను తగ్గించుకునేందుకు ట్యాబ్లెట్ల కంటే ఇన్‌హేలర్ వాడడం మంచిదన్నారు. వ్యాక్సినేషన్‌తో ఆస్తమాను పూర్తిగా దూరం చేయవచ్చని వెల్లడించారు. మెడికవర్ సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రిటికల్ కేర్ నిపుణులు ఉపేందర్‌రెడ్డి, వైద్యులు నాగరాజు, లోకేశ్, సూపరింటెండెంట్ రవి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 గంజాయి కేసుల్లో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న రాజన్న సిరిసిల్ల ఎస్పీ మహేశ్ బీ గీతే

- ఐదు కేసుల్లో పరారీ
- గంజాయి నిరోధానికి సమాచారం ఇవ్వండి: ఎస్పీ మహేశ్ బీ గీతే

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో 15 గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్న ఎండీ హమ్మద్ (23)ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ మహేశ్ బీ గీతే తెలిపారు. మంగళవారం వివరాలు వెల్లడించారు. జిల్లాలోని సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, బోయినపల్లి, చందుర్తి పోలీస్‌స్టేషన్ల పరిధిలో 15 కేసుల్లో హమ్మద్ నిందితుడని వివరించారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాలుగు, చందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మరో కేసులో పరారీలో ఉన్నాడని ఎస్పీ వివరించారు. హమ్మద్ సిరిసిల్లకు వస్తున్నాడనే సమాచారం మేరకు టౌన్ సీఐ కృష్ణ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని ఎల్లమ్మ చౌరస్తా వద్ద పట్టుకుని రిమాండ్‌కు తరలించామని ఎస్పీ తెలిపారు.

గంజాయి నిరోధానికి సహకరించండి

జిల్లాలో గంజాయి రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. గంజాయి నిరోధానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకరించాలన్నారు. జిల్లాలో గంజాయి విక్రయించినా, సాగు చేసినా, రవాణా చేసినా, సేవించిన వారి సమాచారం 87126 56392 నంబర్‌కు అందించాలని ఎస్పీ కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతానమి తెలిపారు. సమావేశంలో టౌన్ సీఐ కృష్ణ, కానిస్టేబుళ్లు శ్రీకాంత్, ఇంతియాజ్ ఉన్నారు.

నాలుగు ఇళ్లలో దొంగతనం



బీరువాను పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

మెట్‌పల్లిరూరల్(కోరుట్ల): మండలంలోని రాంచంద్రంపేట, వెల్లుల్ల గ్రామాల్లోని నాలుగు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రాంచంద్రంపేటకు చెందిన పుల్లూరి గంగమణి, అల్లిక గణేశ్.. వెల్లుల్లకు చెందిన పెండెం నరేందర్, బొడ్డు లింగాధర్ తమ ఇళ్లకు తాళం వేసి ఊరికి వెళ్లారు. మంగళవారం వచ్చి చూసే సరికి ఆయా ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. గంగమణి ఇంట్లో బీరువాలో దాచిన రూ.10వేల నగదు, గణేశ్ ఇంట్లో రూ.4వేల నగదు, నరేందర్ ఇంట్లో రూ.10వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి వేర్వేరుగా పోలీసులకు సమాచారమందించారు. సీఐ అనిల్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్ ఘటన స్థలాలను పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌లతో పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.